కవితా కౌముది

# యుద్ధ విరామ ఒప్పందం

రవి కిషోర్ పెంట్రాల

విరామం తర్వాత
నేను బ్రతికేందుకు
వీళ్ళలో ఎవరితో పోరాడాలో
నా వాళ్ళ కోసం
ఈ గుంపున ఎందర్ని కడతేర్చాలో!

ఆ రోజు నన్ను భయపెట్టిన
ఆ మొహమెవరిదో
నా గన్ను తూటాలకి
గాయపడ్డ ఆ శరీరాలెవ్వరివో!

కదనరంగంలో చెలరేగుతూ
కర్కశంగా కాల్చేస్తూ
నిరాయుధున్ని దయదలిచి వదిలిన
ఆ దయామూర్తులెవరో!

ఎందరికి
ఎందర్ని దూరం చేసానో
ఎందుకు
అందరిని ఎడం చెయ్యాలో!

ఎగసిపడే క్రోధం భయం నిరాశలను
తుఫాన్ సమసినట్టుగా చేసిన
తాత్కాలిక యుద్ధ విరామ ఒప్పందం
కలకాలమెందుకుండదో అనుకుంటూ!

యుద్ధభూమిలో శత్రుసైన్యంపై
మనసుల్లో ద్వేషం లేదని
ఏలికల కీలతో ఆడే
మరమనుష్యులమేననీ తెలుపుకుంటూ!

ఇరుసైన్యాల మృతదేహాలకు
ఉమ్మడిగా వీడ్కోలు పలుకుతూ
బరువైన హృదయాలతో
అంతిమ సంస్కారాలు జరుపుతూ!

ఒకరితోనొకరు ఆడుతూ పాడుతూ
మనస్సులు పంచుకుంటూ
మళ్ళీ జరగబోయే మరణమృదంగానికి
ముందుగానే క్షమాపణలు
చెప్పుకుంటారేమో?

★★★★

# నాన్న ప్రయాణం డా.మూర్తి జొన్నలగెడ్డ

నాన్న పోయినపుడు ...
నాన్న నాకు కాకుండా పోయాడని
స్వార్థంతో ఏడ్చానా?
నాన్న వెళ్ళి పోతున్నాడని,
నేను లేకుండా ప్రయాణం
ఎలా చేస్తాడోనని
నాన్న కోసం ఏడ్చానా? ఏమో!

నా గురించి నేను
ఏడవనక్కర్లేదనుకుంటాను
నాన్న నన్నేమీ సుడిగుండంలో
నెట్టేసి వెళ్ళి పోలేదుగా!
ఈత నేర్పాడు
లోతు తెలిపాడు
ఊతమిచ్చాడు.

నాన్న ప్రయాణం గురించి
నేను ఏడవాలా?
సుడిలో దూకి ఈత నేర్చిన నాన్న
ఆ సుడిలోంచే, బైట ఉన్న నాకు
ఈత నేర్పాడు

వరదల్లో, బురదల్లో ఒకే లాగ
ముందుకు సాగాడు
అప్పుడు గూడు పడవలో
కులాసాగా సాగిన నేను
నాన్న ప్రయాణం గురించి
ఏడవడం నగుబాటు కాదూ!

ఎప్పటికైనా ప్రయాణం తప్పదు
సుఖంగా పయనించడమెలాగో
నేర్చుకో అని, ఆఖరి పాఠం చెబుతూ
వెళ్ళి పోయిన నాన్నకు
వేయి దండాలు పెట్టకుండా
వెక్కుతో కూర్చోనా?

★★★

# కాలగర్భంలో..

శిష్ట్లా వి.యల్.యస్.శర్మ

నా పుట్టుక
ఈ కాల గర్భంలోంచే
నా మరణమూ
ఈ కాల గర్భంలోకే

ఇక్కడ
కాలమే నాకు పునాది
కాలమే నాకు తుది.....
కాలం....అనంత రాగ స్రవంతులు
సృజిస్తూ.... అంతమొందిస్తుంది
రాగ విస్మృతిలో
గమనాన్ని యినుమడింప చేస్తుంది....

ఆ పులకరింతలో
కాలంలో నా ఉనికిని
నిలుపుకొనే యజ్ఞంలో.....
నేను జీవితమౌతాను.....

కాలాన్ని అనుబంధాలతో
ఒడిసి పట్టుకుని
పిడికెడు అనుభవాల్ని
కాలానికందిస్తూ....
కాలగర్భంలో యిమిడిపోతాను.....

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

భావములు లేవు, మనసు స్తబ్ధతను పొందె
సంతసము లేదు, మదిలోన చింత లేదు
హర్షఖేదాదియోచనల్ హరణమయ్యె
ఏల నా యెద యిట్లు ఘనీభవించె?

అమితహర్షముతో శిఖరములనెక్కి
దిగులు పైకొన నేలకు తిరిగి వచ్చి
పవలు రేయియునెన్నొ ద్వంద్వముల చూచి
నిర్వికారస్థితిని పొందె నేడు మనసు

కష్టముల నీడ కన్నీరు కార్చుకొనుచు
హ్లాదమందుననెగురుచునంబరమున
ఎన్నొ యనుభవమ్ములనిలనెదురుకొనుచు
కష్టసుఖములకర్థమ్ము కంటి నేడు

అమితకాలమ్ము పయనించి యలసిపోయి
గమ్యమును చేరబోయెడి క్షణములందు
తిరిగి వెన్కకు చూడనచ్చెరువు కలుగు
వెతలు హ్లాదముల్ లేక జీవితము కలదె!

అర్థవంతములే యన్ని యనుభవములు
పొందనన్నియు బ్రతుకు సంపూర్ణమగును
తిరిగి వేరు జీవితము సిద్ధింప మనకు
మరల కన్నీళ్ళు, సౌఖ్యముల్ మనను పిలుచు

COMMENTS